భట్టిప్రోలు నాగసుందరి సంక్రాంతి కథానికల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# కథ

# నాముందు నీవెంత

డి. రాములు

ఆగిన ప్రతీ బస్సూ, ప్రతి లారీ, కనపడిన ప్రతి వ్యక్తి వెంట ఉరుకులు పరుగులతో హైరానా పడిపోయి 'తేగలూ... తాటి తేగలు ఒక కట్ట పది రూపాయలు, రెండు కట్టలైతే పదిహేను రూపాయలు - ముదురు తేగలూ - మంచి రుచిగల తేగలూ' అంటూ అరుచుకుంటూ తేగలు అమ్ముకుంటుంది ఓ పది పన్నెండేళ్ళ అమ్మాయి.

పేరు రమణ. తండ్రి ఏదో యాక్సిడెంట్‌లో చనిపోవడం చేతా, తల్లి అనారోగ్యంపాలై మంచం పట్టడం చేతా తమ్ముడ్నీ తల్లినీ పోషించే భారం రమణపై బడింది.

తైల సంస్కారంలేని జుట్టూ, వయసుతో పాటు వచ్చే శారీరక మార్పుల్ని చాలీ చాలని గుడ్డలతో కప్పుకోలేక తెగ యిబ్బందిపడుతోంది. మగాళ్ళు తనను వరసలుకడుతూ పరిహాసాలు ఆడడం, కొంటున్నప్పుడు కావాలని చేతుల్ని తాకడం, వెళ్తూ వెళ్తూ దేస్ యివ్వడం, పెరిగే గుండెల్ని తమకంగా చూడడం రమణకు చికాకు కల్గిస్తూనే వున్నాయ్. ఒకరోజు అమ్మకు యీ విషయాలన్నీ చెప్పింది.

"తప్పుదమ్మా! కొవ్వెక్కిన మగాడికి కొండమీద ఆడకోతితో కూడా ఆడుకోవాలనే కామవాంఛ వుంటుంది. వాళ్ళూ వీళ్ళూ అనికాదు మంచిచీర కట్టుకొని అందంగా కనబడ్డ ఆడదాన్నీ అలానే చూస్తారు. మనలాంటోళ్లం పొట్టకూటి కోసం రోడ్‌ను పడ్డా అదే తమకంతో చూస్తారు. తప్పదు. మనం బ్రతకడానికి బ్రతుకుతున్నాం, బ్రతుకు తెరువు కోసం బజార్న పడుతున్నాం. బజారులో బ్రతికే ఆడపిల్ల తనని తను రక్షించుకుంటూ బ్రతకాలేకానీ భయపడి పారిపోతే మనలాంటోళ్లం బ్రతకడం కష్టం. అందుచేత నీ జాగ్రత్తలో నువ్వుండు. తెలిసీ తెలియని వయసు నీది. ప్రలోభాలకూ, ఆకర్షణలకూ లొంగిపోతే జీవితం పతనం అవుతుంది. జాగ్రత్త" అంటూ జీవిత సత్యాన్ని చెప్పింది.

ట్రాఫిక్ ఏమీ లేకపోయేసరికి స్టూల్ మీద కూర్చొని తట్టలోని తేగల కట్టల్ని తలొంచుకుని లెక్క పెట్టుకుంటుంది.

'అమ్మాయ్! ఆ రెండూ ఎంత? లారీ డ్రైవర్ యికిలింపు.

చివుక్కున తలెత్తింది రమణ. ఘాటుగానే జవాబు చెప్పాలనుకుంది. తమాయించుకుంది. 'పది రూపాయలు. యిష్టముంటే కొనండి లేకపోతే మానేయండి. బేరం మాత్రం మరి లేదు' అని కట్టలు లెక్కల్లోకి వెళ్ళిపోయింది.

'నొక్కిచూడొచ్చా'? తన శ్లేషకు తనే మురిసిపోయి, రమణసూడకుండా ఒకతేగల కట్ట క్లీనర్‌కు దొంగతనంగా యిచ్చేసి ఏమీ తెలియనట్టు ఏదో కుళ్లు జోకులేసి ఆనందపడి పోతున్నాడు. రమణ ఆ డ్రైవర్ని కొర కొర చూసింది. మనసులోనే శాపనార్థాలు పెట్టింది. ఆ కొరకొరచూపుల్ని కూడా ఓర చూపులాగే తన్మయత్వం చెందిపోతున్నాడు డ్రైవరు.

"రా గురూ! బేరం ఆడింది చాలు. టైమ్ అవుతుంది" అంటూ క్లీనర్ 'హార్న్' మోగించేసరికి తమకం నుండి బయటకొచ్చాడు డ్రైవరు. ఫ్యాంటు జేబునుండి పర్సుతీసి ఓ ఇరవై నోటిచ్చి పర్సును జేబులో పెట్టుకుంటూ రెండు తేగ కట్టల్ని చేతిలోకి తీసుకొని అయిదు రూపాయిల బిళ్లని జేబులో వేసుకొని గబగబ నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. ముళ్ళకంప నుండి బయటపడినంత రిలీఫ్ ఫీలయింది రమణ.

ఫుల్ లోడుతో బస్సు వచ్చి ఆగింది. టాప్ నుండి లోడేదో దించుతున్నారు కూలీలు. లెక్క పెడుతున్న నోటుల్ని లంగాలో దోపుకుంటూ చిల్లర పైసల్ని తట్టలో తేగలకింద పెట్టి నాలుగు కట్టల్ని పట్టుకొని 'తేగలూ తేగలూ' అంటూ బస్ దగ్గరకు వెళ్లింది. ఓ పాసింజరు రెండు కట్టలు కొన్నాడు. అయిదు రూపాయలు యిస్తే ఇరవై నోటిస్తానంటాడు. ఇరవై నోటిస్తే అయిదిస్తానంటుంది రమణ. ఆ యిద్దరికి ఒకరిమీద ఒకరికి నమ్మకం లేదు. డ్రైవర్ బస్‌ను కదిలించాడు. రమణ ఓడిపోయింది. బొడ్లో వున్న అయిదు రూపాయలు నోటుతీసి అతని చేతిలో పెట్టింది. బస్ స్పీడందు కుంది. డ్రైవర్‌ను బ్రతిమాలుతోంది. పాసింజర్ ఎంతకూ యిరవై రూపాయిల నోటివ్వడే! బస్ స్లో అయింది. ఎట్టకేలకు యిరవై నోటు రమణ చేజిక్కించుకోగలిగింది. వగరుస్తూ తేగలున్న తట్ట

దగ్గరికొచ్చింది. తట్ట పక్కనే మట్టిలో కలిసిపోయిన పర్సు కనిపించింది. పర్సు విప్పిచూసింది... అన్నీ కొత్త నోట్లే. క్రీగంట అటూ యిటూ చూసి ఎవరూ చూడలేదని జాకెట్లో ఆ పర్సును దాచేసింది.

స్టూల్ మీద స్థిమితంగా కూర్చోలేక పోయింది. దొరికిన యీ డబ్బులతో ఏం ఏం చేయాలో ఆలోచనల్లోకి జారిపోయింది. గంగరాజుకు ఇవ్వవలసిన వెయ్యి రూపాయిలూ వడ్డీతో సహా వాడి మొహాన కొడితే ఆ వెధవ పీడ విరగడౌతుంది. అమ్మకు టెస్టులన్నీ చేయించి మంచి మందులు కొనొచ్చు. తాకట్టు పెట్టిన దుద్దులు విడిపించి కోవచ్చు - పాపం అమ్మకు మంచి చీరలు లేవు. ముందు రెండు చీరలు కొనాలి. ఆ తర్వాతే ఏమైనా పనిలో పనిగా తమ్ముడుకు రెండు జతలు బట్టలు రెడీమెడ్‌షాపులో తీసుకోవాలి' యిలా పరిపరి విధాలా ఆలోచిస్తుంది.

ఆలోచనలతో పాటుగా తనలో ఏ మూలో దాగిన వివేకం ఒక్కసారిగా మేల్కొంది. తన తల్లి తనకెపుడూ చెప్తున్న మాటలు జ్ఞాపకానికొచ్చాయి. "అమ్మా! రమణా! కాయకష్టం చేసి నిజాయితీగా బ్రతకాలేగానీ ఎదుటి వాళ్ళ సొమ్ముతో జీవించకూడదే. ఏఆధారం లేక వీధినపడి ఎంత మంది అడుక్కోవడం లేదూ. వాళ్లకంటే మన జీవితం ఎంతో మేలు కదా?" అన్న తల్లి రూపం ఎదుట కనపడింది.

'ఛీ! తనెంత తప్పుగా ఆలోచించింది. పాపం యీ పర్సుపోగొట్టుకున్న మనిషి కున్న అవసరాలేంటో? తల్లితండ్రుల మందుల కోసమో, తన పిల్లల పరీక్ష ఫీజులకోసమో? ఏ కష్టం కోసం తీసుకెళ్తున్నాడో? ఆ పరుసు గురించి తనకెందుకు? తాము అనుభవిస్తున్నా యీ దరిద్రం చాలు యీ జన్మకు" అంటూ దొరికిన డబ్బులు తిరిగి యిచ్చేయడానికే నిర్ణయించుకుంది. చుట్టూ చూసింది. పర్సుకోసం ఎవరైనా వెదుకుతున్నా రేమోనని.

దూరంగా డ్రైవరు ఆందోళనగా వెతుక్కుంటూ డ్రైవరూ క్లీనరూ తనవైపే రావడం గమనించింది. ఆరా తీసింది. పర్సు డ్రైవర్‌దే నని నిర్ధారించుకుని జాకట్‌లోంచి పర్సుతీసి ఆ డ్రైవర్‌కు యిచ్చింది.

పర్సులో అయిదు వేల రూపాయలూ వున్నందుకు సంతోషించి ఓ పది పదిహేను నిమిషాలు ముందు రమణ పట్ల తను ప్రవర్తించిన తీరుకు సిగ్గుపడి, ఆమె నిజాయితీకి కృతజ్ఞతలు చెప్పి అయిదు వందలు సంతోషంగా యివ్వబోయాడు.

వద్దు వద్దంది. అది మీ సొమ్ము అయాచితంగా తన కక్కర్లేదంది.

"అతను సంతోషంతో యిస్తున్నప్పుడు తీసుకుంటే తప్పేంటి? తీసుకో. పేద దానివైనా దొరికినసొమ్ము తిరిగి యిచ్చిన నీ నిజాయితీకి మేమంతా గర్వపడుతున్నాం. తీసుకో తీసుకో " అంటూ చుట్టూ మూగిన జనం నచ్చచెప్పారు.

"ఒక్క వంద రూపాయలు యివ్వండి బాబూ! అదీ మీ తృప్తికోసం మా అమ్మ మందులకోసం..." అంటూ ఒక వందరూపాయలు తీసుకుంది.

చుట్టూ చేరిన జనం పొగుడుతున్నారు. రకరకాలుగా ఆమె నిజాయితీని మెచ్చుకుంటూ, వాళ్ళమ్మ గొప్పతనం గురించి చెప్పుకుంటున్నారు.

బస్ వచ్చి ఆగింది 'తేగలూ.... తేగలూ....' అంటూ పరుగు తీసింది. తనకేమీ పట్టనట్టు - 'నిజాయితీ ముందు లేమి తలవంచింది' అని ఎవరో అనడం ఆ గుంపు రొదలో కొంత మందికి విన్పించింది.

# ఆమె !

## సి.ఆర్. యల్లాప్రగడ

ఎవరు ఆమె?

ఎవరోకాదు. నా హృదయ కుహరంలో
దాగిన అమృతమూర్తి. కానీ నాకు దృగ్గోచరం కాదు.
వెదలి వెదకమంది. తక్షణం కార్యోన్ముఖుండనై కదిలా,
స్వర్ణకాంతులతో ఉదయించే బాలభానుని కిరణాలలో లేదు
గగనంలో విహరించే విహంగముల కిలకిలారవములలో లేదు
నీహారిక జల్లుల నీటి బిందువులలో లేదు
కనులు విప్పిన కమలములపై తారాడుజున్న
రోలంబముల ఝుంకారవములలో లేదు
మనోజ్ఞ మల్లికా కుంజములపై నుండి
సుగంధ పిల్ల తెమ్మెరల వీహోపులో లేదు
పుష్పగుచ్ఛములపై వ్రాలుచూ పైకెగురుచున్న
రంగురంగులు రంజింపజేసెడు సీతాకోక చిలుకలలో లేదు
వృక్షచ్ఛాయ క్రింద నదీ తటమున సైకతవేదికపై లేదు
నిశ్చలంగా ప్రవహించే నదీ నదముల జలములపై లేదు
నిలకడగా వున్న కోనేటి జలాలలో జలకమాడుటలేదు
నదిపైన నావలో జేసెటి విహరణలో లేదు
సాగరతీరాన సంధ్యా సమయంలో
అస్తాద్రికేగుచున్న అరుణకాంతులలో లేదు
నిరంతరాయంగా ఎగిసిపడే
అలల సిగలపై వున్న బుద్బుదములలో లేదు
శరచ్చంద్రికల ధవళకాంతులలో లేదు
మిలమిల మెరిసే తారల తళుకులలో లేదు
ఆహుతౌ అబలల అగ్నికీలలు ఆర్తనాదాల్లో లేదు
వెదకి, వెదకి వేసారా నిస్పృహ, నిరాశా నీరసం !
ఏవో స్పష్టాస్పష్ట శబ్దములు కర్ణపుటములలో వినిపిస్తున్నాయి
నీవు పరిశీలించిన ప్రతిచోట అంతర్లీనమైవున్నా
నీలోనే వుండి నీ నరాల ప్రతిస్పందనలో అనుక్షణం
నీ వేదన, ఆవేదన తిలకిస్తున్నా
నేనెవరో తెలుసా? యాదేవీ సర్వభూతేషు
అనే ప్రకృతికాంతను నేనే !